# 6.4 జానపదం - భవిష్యద్దర్శనం

## 6.4.1 కలలు - భవిష్యత్తు

కాటమరాజు కథలు 13వ శతాబ్దానికి చెందినవి. కాటమరాజుకు నల్లసిద్ధి రాజుకు యుద్ధం క్రీ.శ. 1280–1297 మధ్యన జరిగిందని డా. తంగిరాల వెంకట సుబ్బారావు అభిప్రాయం.

కాటమరాజు తన పశువులకు కడప, కర్నూలు మండలాల్లో అనావృష్టి వలన కసవు లభించనందువల్ల నెల్లూరు సీమకు వచ్చి, నల్లసిద్ధి రాజుతో తన మందలో పుట్టే కోడెదూడలను పుల్లరిగా నిర్ణయించుకున్నారు. కానీ నెల్లూరు రాజ్యంలో కూడ అనావృష్టి సంభవించడం చేత కసవు లభ్యం కాలేదు. పుల్లరిని చెల్లించలేకపోయాడు. అందువల్ల కాటమరాజుకు నల్లసిద్ధి రాజుకు మధ్య యుద్ధం సంభవించింది.

కాటమరాజు చెల్లెలు అగుమంచి. ఆమె పోలురాజు కూతురు. పోలురాజు చెల్లెలు కొమరమ్మ. కొడుకు పుత్తమరాజు, భార్య అగుమంచి. కాటమరాజు, అయితమరాజు, కఱియావులరాజు, భట్టావుల రాజు, ఎఱ్ఱయ్య, భక్తిరన్న, ముమ్మయ్యలు అగుమంచి అన్నలు.

ఎఱ్ఱగడ్డ పాడులో యుద్ధం జరుగుతుంటుంది. అన్నల దగ్గరనుండి పావురాలతో క్షేమ వార్తలు వస్తాయని ఎదురుచూస్తుంది. కాని పావురాలు, వార్తలు రావు. దాంతో ఆమె ఆందోళన చెందుతుంది. శివరాత్రి వస్తుంది. జంగమార్జన చేసి తలంటుకోవాలని అనుకుంటుంది. ఆమె వదిన తలంటుకు బంగారు గిన్నెలో నూనెను తెస్తుండగా ద్వారబంధం తగిలి నూనె



ఒలికిపోతుంది. అది అపశకునమని అనుకుంటారు. యాదవకాంత లందరు మరునాడు (సాగు మానము) సహగమనం చేయవలసి వున్నదని అగుమంచి శకునం చెపుతుంది. ఆమె స్నానం చేసిన నీరు పెసలకు పారుతుంది. ఆమె అత్త అది దుశ్శకునమని తన అన్నల మరణానికి ముందు తన తలంటే పెసలకు పారిందని చెపుతుంది.

అగుమంచి తన అన్నలిచ్చిన ఆభరణాలను, చీరెలను ధరించి అద్దంలో చూసు కుంటుంది. చీరలు, నగలు వెలవెల బోయినట్లు కనిపిస్తాయి. అప్పుడామె తన అన్నలకు ఆపద వచ్చిందని అనుకుంటుంది. గంగ గుడికి పోయి బోనాలను చెల్లించి, తన అన్నల క్షేమాన్ని అడుగుతుంది. గంగ విగ్రహం వెలవెల పోతుంది. అగుమంచి ఇంటికి వచ్చి నిద్రపోతుంది. నిద్రలో కలలు వస్తాయి. ఆ కల ఫలితాలను అన్న కాటమరాజు భార్య వీరగంగను అడుగుతుంది. కలల ఫలితాలను విప్పి చెపుతుంది[1].

కథాంతంలో యుద్ధంలో అగుమంచి అన్నలు, భర్త చనిపోతారు. అగుమంచి ఇతర యాదవకాంతలు అగ్నిలోపడి మరణిస్తారు.

కలలు కొన్ని సమయాలలో భవిష్యత్తును సూచిస్తాయనడానికి ఇదొక చక్కని నిదర్శనం. అగుమంచి వదిన వీరగంగతో తన కల చెప్పగా, వీరగంగ కల విప్పి యాదవ వీరుల మరణాన్ని తెలియజేస్తుంది. కలలో చమురు చిందిందని, నెత్తురు వాన కురిసిందని, అయిదు కొండలు పెళ్ళగిల్లెనని..... కలలను గురించి చెప్పటం, వదిన వాటిని విడమరచి చెప్పటం కనిపిస్తుంది.

---

1. కాటమరాజు కథలు, సంపాదకుడు డా. తంగిరాల వెంకట సుబ్బారావు, రెండవ సంపుటం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, కళాభవన్, హైదరాబాదు, ప్రథమ ముద్రణ 1976. పుట 500–509.

## 6.4.2 శకునాలు - భవిష్యత్తు

తెలుగు వీరగాథా సంపదలో పల్నాటి వీరగాథల తర్వాత పేర్కొనదగినవి కాటమరాజు కథలు. చారిత్రక వీరగాథలైన కాటమరాజు కథలను యాదవ రాజుల కథలు, యాదవ భారతం, యదుశాస్త్రం అని కూడ వ్యవహరిస్తారు.

కాటమరాజు కథ వలురాజుతో మొదలవుతుంది. వలురాజు కాటమరాజు తాత, యలమంచిలిని పాలిస్తాడు. వలురాజుకు సింహాద్రి, పెద్దన్న, చిన్ననూక, నలనూక అనే నలుగురు కుమారులు, కొమరమ్మ అనే ఒక కూతురు ఉన్నారు. వలురాజు తన కుమారుడు పెద్దిరాజుకు రాజ్యాన్ని అప్పగించి ఖండె మొండెముల కోటను ఆక్రమించటానికి వెళ్తాడు. అక్కడ జరిగిన యుద్ధంలో కలభూత గంగరాజును ఓడించి యుద్ధంలో తగిలిన గాయాల వల్ల మరణిస్తాడు.

వలురాజు మరణం తర్వాత పెద్దిరాజు అతని సోదరులు పెద్దలు మరణించిన ఊరులో ఉండలేమని భావించి పంపాద్రికి వెళ్తారు. పంపాద్రిలో పైడమ్మ అనే శక్తి (తల్లి) ఉంటుంది. పైడమ్మ శక్తి సమీపంలో ఒక చింత చెట్టు పద్దెనిమిది యుగాలనుండి ఉంది. ఆ చెట్టును పైడమ్మ చింత అని అంటారు. ఆ చెట్టు మీద పక్షులున్నాయి. ఆ చింత చెట్టు కిందే పెద్దిరాజు సైనికులు పెద్దిరాజు మంత్రి పల్లికొండ బస చేస్తారు. ఆ సమయంలో పక్షులు తమలో తాము ఈ విధంగా మాట్లాడుకుంటాయి.

కృతయుగంలో హరిశ్చంద్రుడు సత్యాన్ని పాటిస్తూ రాజ్యాన్ని పాలిస్తుండగా అతనికి కలగబోయే విఘాతాన్ని చెప్పాం. చెప్పినట్లుగానే హరిశ్చంద్రుడు భార్యను కుదవ బెట్టి కులము చెడి అంత్యజుని కొలిచాడు.

త్రేతాయుగంలో శ్రీ రామచంద్రుడు అయోధ్యను పాలిస్తున్న సమయంలో



అతనికిజరగబోయే విఘాతాన్ని చెప్పాం. చెప్పినట్లుగా రాముడు అడవుల పాలయ్యాడు. ద్వాపర యుగంలో పాండవులు రాజ్యాన్ని పాలిస్తుండగా వారికి జరిగే కీడును చెప్పాం. తరువాత వారు అడవుల పాలయ్యారు.

కలియుగంలో వలురాజు జాతకాన్ని చెప్పాం. చెప్పినట్లుగానే యుద్ధంలో గోపాలురు మరణించారు. మిగిలినవారు పంపాద్రిని పాలించటానికి వచ్చారు. వారికికూడ జరగబోయే యోగక్షేమాలను తెలుపుతామని పక్షులు మాట్లాడు కుంటుంటాయి.

ఈ మాటలు విన్న యాదవ సామంతులు పక్షులు ఏమన్నాయో తెలపమని పల్లికొండను అడుగుతారు. పల్లికొండ సాయంత్రం వేళ పక్షులను ఏమి అనరాదు అని సాయంత్రం వేళ దేవతావక్షి పలుకులు పట్టరాదు.తెల్లారినట్లయితే చెప్తాను అంటాడు. పల్లికొండ యాదవులనందరిని వారివారి స్థానాలకు పంపిస్తాడు. తాను వెళ్ళి మరునాడు పక్షులు ఎటు వెళ్ళరాదని ఆనపెట్టి వస్తానని పక్షుల వద్దకు వస్తాడు. పల్లికొండ పక్షులతో మరునాడు ఎటూ వెళ్ళరాదని వెళ్ళినట్లయితే గరుత్మంతుని, శ్రీరాముని ఆన అని చెప్పి వెళ్ళిపోతాడు.

మరునాడు ఉదయాన్నే పల్లికొండ పైడమ్మ తల్లి వద్దకు చేరతాడు. పైడమ్మ తల్లితో పక్షులు తనకు భవిష్యత్తు చెప్పాలని వాక్కు ఇమ్మని కోరతాడు. తరువాత పల్లికొండ పక్షులతో శకునపంతం సత్యంగా చెప్పమని కోరుకుంటాడు. ఆడి తప్పినట్లయితే గోవును, వారణాసిలో బ్రాహ్మణుని చంపిన పాపం తగులుతుందని చెప్తాడు. అబద్ధం చెప్పినా శకునం చెప్పకపోయినా తాను వాటిని దండిస్తానని అంటాడు. తన మీద కోపం చేయకుండా మేలు కీడు చెప్పమని వేడుకుంటాడు.

## 6.4.2.1 పక్షులు శకున పంతం చెప్పటం

పల్లికొండ మాటలు విన్న పక్షులు కిలాకిలా నవ్వి ఈ విధంగా చెప్తాయి...

1. పెద్దిరాజు పంపాద్రిని ఏడు సంవత్సరాలు పరిపాలిస్తాడు అని చెప్పడానికి మధ్యలో ఒక పక్షి ఉండగా మరికొన్ని పక్షులు కొలువు తీరి వుంటాయి.
2. బలమైన సంపదలతోఉన్నతంగా వర్ధిల్లుతారని చెప్తాయి.
3. మంచిగా బంతులు అన్నం వడ్డించినట్లు కొన్ని పక్షులు తమ గూళ్ళలో ఉన్న పక్షులకు మేత పెట్టాయి.
4. ఏడవ సంవత్సరంలో ఐదుగురు తోడికోడళ్ళు పంపాద్రి బసవనకు వ్రతాలు పడతారు.
5. పూవులు రాలగా చూసి బసవన్న తన నోము ఒప్పకపోవటం వల్ల పెద్దిరాజు భార్య పెద్దమ్మ దుఃఖించినట్లు తెల్పాయి.
6. పెద్దమ్మతో పాటు తక్కిన కోడళ్ళు కూడా దుఃఖిస్తారని చెప్పటానికి మిగతా పక్షులు కూడా దుఃఖిస్తాయి.
7. పల్లికొండకు కనబడే విధంగా ఆ పక్షులు పైడమ్మ చింతను వదలి వివిధ దేశాలకు ఎగసిపోతాయి. ఈ చర్య పెద్దిరాజు సోదరులు విడిపోవటాన్ని సూచిస్తుంది.
   రెండు పక్షులు సతి, పురుషుడు శ్రీ కూర్మం వైపు వెళాతాయి.
   రెండు పక్షులు కళ్యాణ దేశంవైపు వెళతాయి.
   రెండు పక్షులు ఏనుగునాథు కొండ వైపు వెళతాయి.



రెండు పక్షులు బెజవాడ వైపు వెళతాయి.

రెండు పక్షులు చంకలో ఒక బిడ్డను పెట్టుకుని దక్షిణ శ్రీరంగం వైపు వెళతాయి.

అన్నదమ్ములు అందరూ వెళ్ళటం చూసిన సోదరి పక్షి (కొమరమ్మ) దుఃఖిస్తూ దక్షిణ శ్రీరంగం వెళ్ళే పక్షుల వెంట ఎగసిపోతుంది.

ఈ విధంగా వలురాజు కుమారులు అందరూ విడిపోతారని చెప్తాయి. ఈ శకునం చూసి పల్లికొండ బాధపడతాడు. అయినప్పటికిని సింహాద్రి సోదరులకు నిజమే చెప్పాలని భావించి వారి వద్దకు వెళ్తాడు.

## 6.4.3 సోదె- భవిష్యత్తు

జానపద సాహిత్యంలో భవిష్యత్తును సూచించే వారు సోదె చెప్పే వాళ్ళు, బుడబుక్కల వారు. విజయరాఘవ నాయకుని ఆస్థాన కవయిత్రి పసుపులేటి రంగాజమ్మ రచించిన మన్నారుదాస విలాస నాటకంలో జోస్యుల యేషాగాథలు, ఎఱుక ఘట్టం పరిశీలించినట్లయితే

> "అమ్మాయమ్మ అమ్మాయమ్మ శెయిసూపు శెయిసూపు
> శెయిసూపలె దుండి, దనము గల శెయ్యే,
> దానము గల శెయ్యే, బంగారు శెయ్యే, బాగ్గెముల
> శెయ్యే దుండి... కండ్లంటే తోడు, కడుపంటే
> కొడుకు, కంటంటే మగండు వొండె రెండే వొండు" [1]

---

1. ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర, యస్వీ జోగారావు, 1961, పు. 273.

ఎఱుకత చెప్పే సోదెనే గద్దె అని, కొరవంజి గద్దె అని వ్యవహరిస్తారు. పలు యక్షగాన నాటకాల్లో సోదె చెప్పే ఎరుకత పాత్రల మూలంగా జరుగబోయే కల్యాణాలను సూచించటం పరిపాటి. జానపదులు ముఖ్యంగా బుడబుక్కల వారు, కొరవంజులు భవిష్యత్తును సూచిస్తుంటారు.

జ్యోతిష్యులు శాస్త్రీయ పద్ధతిలో భవిష్యత్తును సూచిస్తారు. దేవతాశక్తి వల్లనే కొరవంజులు భవిష్యత్తును నిర్ణయిస్తారు. చెంచులక్ష్మి, నరసింహుల వివాహానికి ఆదిలక్ష్మి ఎరుకలసానిగా వచ్చి చెంచులక్ష్మికి ఎరుక చెపుతుంది. సాక్షాత్తు ఆ శ్రీనివాసుడే ఎరుకల నాంచారి వేషంలో వచ్చి పద్మావతికి ఎరుక చెప్పి తనపై మరులు గొనేట్టు చేస్తాడు.

గోగులపాటి కూర్మనాథ కవి రచించిన 'మృత్యుంజయ విలాసము'లో శివపార్వతుల 'కళ్యాణ కథ' ప్రధాన ఇతివృత్తం. శివుడు ఎరుకత వేషం ధరించి పార్వతికి శివుని ప్రేమను తెలియజేస్తాడు.

మన్నారు దేవుని 'హేమాబ్జ నాయికా స్వయంవరము'లో ఎఱుకత పాత్ర కనిపిస్తుంది. యక్షగానాల్లో నాయికా నాయకుల సమాగమానికి ఎరుకల పాత్ర ఉపకరిస్తుంది.

బుడబుక్కల వారు అమ్మవారిని క్షుద్ర దేవతలను కొలిచి భూత భవిష్య ద్వర్తమాన కాలాలను తెలియజేస్తుంటారు. ఇంటింటికి తిరిగి వారి మంచి చెడులను సూచిస్తుంటారు.